క్లుప్తంగా

మూడో రోజు 611 మంది ఓటింగ్

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా సోమవారం మూడో రోజు 611 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోలింగ్ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఏలేశ్వరం మండలంలోని 110 మంది, ప్రత్తిపాడు మండలంలోని 95 మంది, రౌతులపూడి మండలంలోని 213 మంది, శంఖవరం మండలంలోని 177 మంది పోలింగ్ సిబ్బందితో పాటు అత్యవసర విభాగానికి చెందిన 16 మంది వెరసి 611 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సీహెచ్ విద్యాపతి తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

పురోహిత క్రికెట్ టోర్నీ విజేత కాకినాడ

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఇంద్రపాలెం గ్రామానికి చెందిన దివంగత యల్లాజ్యోసుల శేషు ఎందరో యువ క్రీడాకారులను తయారు చేశారని క్రికెట్ సంఘ మాజీ అధ్యక్షుడు తలాటం హరిష్ అన్నారు. సోమవారం స్థానిక శశికాంత్ నగర్‌లోని క్రిక్స్ 8 నెట్స్‌లో యల్లాజ్యోసుల శేషు స్మారక బ్రాహ్మణ బాక్స్ క్రికెట్ రాష్ట్ర స్థాయి టోర్నీ ముగింపు జరిగింది. ఫైనల్స్‌లో కాకినాడ విజేత కాగా, హైదరాబాద్ రన్నర్స్‌గా నిలిచింది. బహుమతీ ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథి తలాటం హరిష్ విజేతలకు కప్‌లను అందజేశారు. కార్యక్రమంలో నేమాని ఆస్ట్రాలజీ ప్రతినిధి రమేష్, వీరబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు సేవలకు సొంత భవనాలు

- గ్రామాల్లో జోరుగా భవనాల నిర్మాణం
- ఐదేళ్లలో పెరిగిన ప్రభుత్వ ఆస్తులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



టి.వెంకటాపురం గ్రామస్తులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్న సచివాలయం, ఆర్‌బీకేలు

తుని రూరల్: గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు రూ.కోట్ల విలువైన సొంత భవనాలు సమకూరుతున్నాయి. వివిధ గ్రాంట్లు మంజూరు కావడంతో పలు రకాల సేవలకు పక్కా భవనాలు నిర్మితమవుతుండగా ప్రభుత్వానికి రూ.కోట్లు విలువ చేసే ఆస్తులు సమకూరుతున్నాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లో రూ.50.13 కోట్లతో 180 సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ల (హెల్త్ క్లినిక్‌లు) నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికే 50 శాతం వరకు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. రోడ్లు,భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఇప్పటికే పూర్తయిన భవనాలను ప్రారంభించడంతో ఆయా కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2019కి ముందు ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సొంతూళ్లలోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ఇందు కోసం గ్రామాల్లో రూ.40 లక్షల నుంచి రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం, వ్యవసాయ సంబంధిత సేవలకు రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం, వైద్య సేవలకు రూ.18.50 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లను నిర్మించారు. దీంతో ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

నియోజకవర్గంలో ప్రభుత్వ భవనాల వివరాలు

భవనం పేరు	మంజూరైనవి	పూర్తయినవి	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
గ్రామ సచివాలయాలు	67	37	రూ.26.05
రైతు భరోసా కేంద్రాలు	58	19	రూ.13.94
వెల్‌నెస్ సెంటర్లు	55	7	రూ.10.14
మొత్తం	180	63	రూ.50.13

సొంతూరులోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు



వి.కొత్తూరు పంచాయతీలో కలసి ఉన్న మా గ్రామాన్ని లోవ కొత్తూరు పంచాయతీగా విభజించారు. మొదట్లో అద్దె భవనంలో పంచాయతీ సేవలు అందించారు. రూ.43.60 లక్షలతో సచివాలయ భవనం నిర్మించడంతో ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే పొందుతున్నాము.

– లంక కృపానందం, లోవకొత్తూరు

ఊర్లోనే వైద్య సేవలు



నాలుగేళ్లకిందట వైద్యానికి తేటగుంట పీహెచ్‌సీకి, తునిలో ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. రెండేళ్లకిందట మా గ్రామంలో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. వైద్యులన్నీ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు ఉన్న ఊర్లోనే వైద్య సేవలు, ఉచితంగా మందులు అందుతున్నాయి.

– పప్పు వెంకటరమణ, టి.వెంకటాపురం

పంచారామ క్షేత్రంలో భక్తుల కోలాహలం



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. స్వామివారికి ప్రీతైన సోమవారం రోజు కావడం, విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో ఉదయం నుంచీ భక్తులు ఆలయానికి తరలి వచ్చి, స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజ, తొలి అభిషేకాలను నిర్వహించారు. ఈఓ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న మూలవిరాట్, ఉప ఆలయాల్లోని స్వామివారికి, అమ్మవార్లకు పూజలు చేశారు.

మహిళల పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి
- కొండతిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం



కొండతిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల వెంకటలక్ష్మి

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని కొండ తిమ్మాపురం గ్రామంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాల అమలులో మహిళలకే తొలి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సీఎం జగన్ మళ్లీ అధికారం చేపడితే మహిళలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. సీఎం జగన్‌కు మహిళలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేత వరుపుల రాజబాబు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటు వేయాలి

అన్నవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కుమార్తె రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. అన్నవరంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పంచాయతీ వార్డు సభ్యులు సింగంపల్లి రాము, ఆశిన శ్రీను, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, సరమర్ల మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల రాజ్యలక్ష్మి

ములగపూడిలో వరుపుల ఊర్మిళ ప్రచారం

రౌతులపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందించారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోడలు వరుపుల ఊర్మిళ అన్నారు. మండలంలోని ములగపూడిలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్ వీవీ సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, పార్టీ నాయకులు అంకంరెడ్డి సతీష్, రుత్తల సత్తిబాబు, లవుడు శ్రీనివాసు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం భూరుగుపూడి, సోమవరం, కృష్ణవరం గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. చంద్రబాబు, కూటమి నేతలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అన్నివర్గాల ప్రజలకూ మేలు చేకూరాలంటే ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేశారన్నారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, పాటంశెట్టి కృష్ణమూర్తి, ఆశపు బద్రి, కర్రి నారాయణమూర్తి, సర్పంచ్ గౌరకపూడి అనంతలక్ష్మి, ఎంపీటీసీ గౌరకపూడి మమత, పార్టీ నాయకులు అడబాల వెంకటేశ్వరావు, అడబాల నాగు, కడిమి రమేష్, చింతలపూడి రమేష్‌బాబు, ఓలేటి రాజు, తోట అయ్యన్న, తోట వరహాలియ్య, దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి



బైక్ ర్యాలీలో పాల్గొన్న వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు



గ్రామాల మీదుగా ఉత్సాహంగా సాగుతున్న బైక్ ర్యాలీ

- ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- గ్రామాల్లో ఎమ్మెల్సీ అనంతబాబుతో కలిసి భారీ బైక్ ర్యాలీ

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతఉదయ్ భాస్కర్ (అనంతబాబు) అన్నారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లోని పలు గ్రామాల మీదుగా సోమవారం వందలాది మోటారుసైకిళ్లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి యువకులు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రతి గ్రామంలోనూ ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు పూర్తి విశ్వాసం ప్రకటించారన్నారు. ప్రతిపక్షాలు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మలేదన్నారు. 2014లో ప్రకటించిన మేనిఫెస్టోను బుట్టదాఖలు చేసిన చంద్రబాబు మోసాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను 99 శాతం అమలు చేశారన్నారు. అన్ని వర్గాలకూ సమన్యాయం చేసిన సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బదిరెడ్డి గోవింద్, పైల సుభాష్ చంద్రబోస్, సామంతుల సూర్యకుమార్, బెహరా దొరబాబు, గోళ్ల కాంతి సుధాకర్, బెహరా రాజరాజేశ్వరి, రామిశెట్టి నాని, దళే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- మల్లవరంలో ఎన్నికల ప్రచారం



మల్లవరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న తోట రాంజీ



జగ్గంపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట ప్రసూన, పార్టీ నేతలు

గోకవరం: ప్రజల ఆశీస్సులతో మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని మల్లవరంలో రెండోరోజు సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఇటీవల సీఎం జగన్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిందన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన తండ్రి తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు, నాయకులు సేనాపతి త్రిమూర్తులు, పైల కల్యాణ్, అల్లం వెంకన్న, గోరుముచ్చు చిట్టిబాబు, పల్లెల నాగబాబు, పాము సూరిబాబు, వి.నాని తదితరులు పాల్గొన్నారు.

నియోజవర్గ అభివృద్ధి 'తోట'తోనే సాధ్యం

జగ్గంపేట: నియోజకవర్గ అభివృద్ధి వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి, తన తండ్రి తోట నరసింహంతోనే సాధ్యమని అతని కుమార్తె ప్రసూన అన్నారు. సోమవారం జగ్గంపేటలో ప్రసూన, మండలంలోని రామవరంలో తోట శ్రీనిధి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహం, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఓమ్మి రఘురాం, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, పార్టీ నేతలు కరుటూరి వీర్రాజు, కె.పైడియ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి జాతర

కొత్తపల్లి: పొన్నాడ శివారు రావివారిపోడులో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఏడి పింఛన్

- పెన్షన్ల కోసం లబ్ధిదారులకు కష్టాలు
- బ్యాంకుల వద్ద పడిగాపులు



రాచపల్లిలో యూనియన్ బ్యాంకు పాయింట్ వద్ద పింఛనుదారుల పాట్లు

తొండంగి: ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దే ఠంఛన్‌గా పింఛన్ అందుకునే వృద్ధులు, వితంతువులు ఈ నెల పింఛన్ల సొమ్ముల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గ్రామ వలంటీర్ల సేవలపై ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వారంతా మూకుమ్మడిగా రాజీనామా చేసిన సంగతి విదితమే. కాగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల పింఛన్ల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మండల వ్యాప్తంగా 12795 వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు ఉండగా వీరిలో 10125 మందికి డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు పింఛన్ల నగదు జమ చేసినట్టు ఎంపీడీఓ మణేశ్వరరావు తెలిపారు. దివ్యాంగులు, మంచానికే పరిమితమైన 2670 మందికి అధికారుల ద్వారా ఇంటి వద్దనే నేరుగా నగదు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. డీబీటీ ద్వారా పింఛన్లు తీసుకునే లబ్ధిదారులు బ్యాంకుల బాట పట్టారు. సొమ్ములు విత్ డ్రా చేసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

బ్యాంకు వద్ద పడిగాపులు

ఆ వృద్ధుడి వయస్సు 73 ఏళ్లు. కోనప్రాంతం పెరుమాళ్లపురం పంచాయతీ రామారావుపేట గ్రామం. గతంలో ఇంటి వద్దనే పింఛన్‌ను తీసుకునే వాడు. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల పింఛన్ల సొమ్మును బ్యాంకులో జమ చేశామని అధికారులు తెలపడంతో నగదు కోసం పెరుమాళ్లపురం నుంచి ఒంటిమామిడి మీదుగా రెండు ఆటోలు మారి గోపాలపట్నంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు ఉదయాన్నే వచ్చాడు. బ్యాంకు ఎప్పుడు తెరుస్తారా అని పడిగాపులు కాసాడు. సొమ్ములు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. అలాగే గ్రామాల్లో వందలాది మంది లబ్ధిదారులు పింఛన్ల సొమ్ము కోసం ఇబ్బందులు పడుతున్నారు.

తీరని పింఛన్ కష్టాలు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: ప్రతినెలా ఒకటో తేదీన తెల్లారేసరికి ఇంటి ముందు వలంటీర్ ప్రత్యక్షం. పింఛన్ సొమ్ము చేతిలో పెట్టి, ఆప్యాయంగా పలకరించి పోయేవారు. ఇది రెండు నెలల కిందటి మాట. గత రెండు నెలలుగా అవ్వాతాతలకు పెద్ద కష్టం వచ్చి పడింది. ప్రతిపక్షాల పుణ్యామని పింఛన్‌దారులకు పాత రోజులు పునరావృతం అయ్యాయి. టీడీపీ సానుభూతిపరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషన్ వలంటీర్ల సేవలను అర్థాంతరంగా నిలిపి వేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దీంతో గత రెండు నెలలుగా వలంటీర్ల ద్వారా జరిగే పింఛన్ల పంపిణీ నిలిచి పోయింది. మండల వ్యాప్తంగా 38,580 మంది పింఛనుదారులు ఉన్నారు. వారిలో 29,974 మందికి డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలో జమచేశారు. మిగిలిన 8,566 మందికి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేశారు. బ్యాంకు ఖాతాలో సొమ్ములు జమైన వారు వాటిని డ్రా చేసుకొనేందుకు పడరానిపాట్లు పడుతూనే ఉన్నారు. బ్యాంకుల వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఎండ తీవ్రత కారణంగా ఎక్కువ మంది ఉదయం 9 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకుని సిబ్బంది కోసం ఎదురుచూస్తూరు. సోమవారం వందలాది మంది ఒకేసారి రావడంతో బ్యాంకు సిబ్బంది సైతం సమాధానం చెప్పలేక ఇబ్బంది పడ్డారు.

90 ఏళ్ల వయసులో తప్పని ఇబ్బందులు



నాపేరు యడ్ల రత్నం. నా వయస్సు 90 సంవత్సరాలు. మాది గోపాలపట్నం గ్రామం. వృద్ధాప్యం మీదపడటంతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాను. ఇప్పటివరకూ వలంటీర్లు ప్రతి నెలా ఇంటికి వచ్చి పింఛన్ నగదు అందించే వారు. ఈ నెల బ్యాంకులో వేశామని అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ బ్యాంకులో నగదు పడిందో లేదో తెలుసుకునేందుకు బ్యాంకుకు వచ్చాను. పింఛన్ నగదు కోసం వృద్ధాప్యంలోనూ నాకు ఇబ్బందులు తప్పలేదు.

– యడ్ల రత్నం, వృద్ధురాలు, గోపాలపట్నం

జననేత జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం



కొలిమేరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి రాజా తనయుడు శంకర్‌మల్లిక్

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

తుని రూరల్: జననేత, సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు దాడిశెట్టి శంకర్ మల్లిక్ అన్నారు. మండలంలోని కొలిమేరు, ఎన్.సూరవరం, ఎన్ఎస్‌వీ పురం గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, నాయకులు పాకలపాటి రవిరాజు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు తదితరులు పాల్గొన్నారు.



వేమవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గ్రామాల్లో ప్రచారం

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మంత్రి దాడిశెట్టి రాజాకు మద్దతుగా వేమవరం, యాదాలవారి ఊరు, పంపాదిపేట గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వేమవరంలో ఎంపీటీసీ కఠారి లక్ష్మణ్‌కుమార్, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి యనమల పంపా ప్రవీణ్, సర్పంచ్ మారేటి కృష్ణ తదితరులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.